క్లుప్తంగా

చిన్నారులపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ జడ్జి శైలజ

ఆళ్లగడ్డ: చిన్నారులు, బాలలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధిస్తారని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ పిల్లలు లైంగిక వేధింపులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో బాలలపై లైంగిక పరమైన దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తుతెలియని వ్యక్తిగాని, కుటుంబ సభ్యులైనా అసభ్యకరమైన చేష్టలు గావించినప్పుడు వెంటనే తల్లిదండ్రులకు లేదా దగ్గరలో ఉన్న పోలీసులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు

వాల్మీకులను మోసం చేస్తే పతనం తప్పదు

నంద్యాల(అర్బన్): ఎస్టీ రిజర్వేషన్ బిల్లు విషయంలో మాయమాటలతో వాల్మీకులను మోసం చేసే రాజకీయ పార్టీలకు పతనం తప్పదని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న అన్నారు. బుధవారం స్థానిక దేవనగర్ వాల్మీకి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణపై అసెంబ్లీలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీ డీకే అరుణ మాట్లాడటంపై కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఈపంట సామాజిక తనిఖీపై గ్రామసభ

గోస్పాడు: ఈపంట సామాజిక తనిఖీపై బుధవారం ఒంటివెలగల గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ బాల నరసింహులు మాట్లాడుతూ ఈపంటకు సంబంధించిన రైతుల వివరాలు, పంట సాగు వివరాలను చదివి వినిపించామన్నారు. అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 18 లోపు రాత పూర్వకంగా స్థానిక కార్యాలయంలో తెలియజేస్తే సరిచేస్తామన్నారు. ఈ నెల 22న తుది జాబితా విడుదల తర్వాత మార్పులు చేయడానికి వీలుపడదన్నారు. సంబంధిత రైతుల ఫోన్ నెంబర్లకు మెసేజ్ వస్తుందన్నారు. కార్యక్రమంలోరైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని డాక్టర్ గెలివి సహదేవుడు అన్నారు. బుధవారం బాలా అకాడమీ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రిపరేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒత్తిడిని జయించి పరీక్షలు రాస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చునని చెప్పారు. విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా విషయాలను వివరించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి

చాగలమర్రి: పంటల సాగులో ఎప్పటికప్పుడు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ రంగనేతాజి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొలుములపేట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సజ్జ, వేరుశనగ పంటలో పాటించవలసిన ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు.

ఇరువర్గాల ఘర్షణ

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం పంచాయతీ మజరా అయిన సుగాలి తండాలో బుధవారం ఇరువర్గాలు ఘర్షణ పడి ఒకరినొకరిపై దాడి చేసుకున్నారు. నాగేశ్వర నాయక్ అనే వ్యక్తి ఇల్లు వెనుకభాగం లోతట్టులో ఉండటంతో వర్షం నీరు నిలుస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి ఆయన బుధవారం మట్టి తోలుతుండగా పక్కన నివసించే నాయక్,మల్లేష్ నాయక్ అనే ఇరువురు అడ్డుకొని దాడికి పాల్పడ్డారు. గాయాలపాలైన నాగేశ్వర్‌నాయక్ ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ఉయ్యాలవాడ: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా రీసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా సూచించారు. బుధవారం ఉయ్యాలవాడలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన పదార్థాల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చెత్త సంపదలో భాగంగా తొట్లలో నింపిన వానపాములను పరిశీలించారు. ప్రజల నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేకరించిన వాటి ద్వారా సంపదను ఏ విధంగా సృష్టించాలన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, మండల స్వచ్ఛ కో ఆర్డినేటర్ రమణారెడ్డి, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.



➤ఇక్కడ వరి పొలంలో పొట్టదశలో ఉన్న పంటను చూపుతున్న రైతు పేరు ఫిదా హుసేన్. ఈయన కేసీ కింద సుమారు ఐదెకరాల వరకు వరి సాగు చేశాడు. ప్రస్తుతం నీరు అందక పోవడంతో పంట చేతికి రాదని వాపోతున్నాడు. కనీసం అధికారుల స్పందించి నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాలని కోరుతున్నాడు.లేకపోతే పంట పండక అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఇది దొర్నిపాడు మండలంలో వరిసాగు చేసి న రైతుల పరిస్థితి. పంట చేతికొచ్చిన సమయంలో నీటి తడులు అందక పైర్లు ఎండు తున్నాయని ఆందోళన చెందుతున్నారు.



దొర్నిపాడులోని కేసీ కెనాల్ 24 లాక్‌వద్ద నిలిచిన నీటి ప్రవాహం

అందని నీటి తడి.. రైతన్న కంటతడి!

- కేసీకి నిలిచిన సాగునీరు
- ఆందోళనలో వరి రైతులు
- ఎండుతున్న చివరి ఆయకట్టు పంటలు

దొర్నిపాడు: వరి రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఖరీఫ్ కలిసిరాలేదు.. కనీసం రబీలోనైనా అనుకున్న దిగుబడి సాధించి కొంతమేర అప్పుల భారం తగ్గించుకోవచ్చుననుకుంటే నిరాశే మిగులుతోంది. ప్రస్తుతం వరిపంటలు పొట్ట దశలో ఉన్నాయి. మండుతున్న ఎండలకు సకాలంలో సాగునీరు అందక ఆ పంట కాస్త వాడి పోతుంది. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని అమ్మిరెడ్డినగరం, కొండాపురం, అర్జునాపురం, వెంకటేశ్వరనగరం, రామచంద్రాపురం, దొర్నిపాడు, చాకరాజువేముల, భాగ్యనగరం గ్రామాల్లో కేసీకి సాగునీరు నిలిచిపోవడంతో పంట పొలాలు బీటలు వారాయి.

520 ఎకరాల్లో పంటల సాగు

కేసీ కెనాల్ 22వ లాక్ వెంకటేశ్వరనగరం నుంచి 25 లాక్ రామచంద్రాపురం వరకు సుమారు 520 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. వీటిలో వరి 420 ఎకరాలు ప్రధానంగా సాగుచేశారు. కొర్ర, నువ్వులు, మినుము పంటలను 100 ఎకరాల వరకు సాగుచేశారు. అయితే ప్రస్తుతం వరి పొట్టదశంలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం సాగునీరు అదుపు తప్పినా ఒక్క గింజ చేతికి రాదని వాపోతున్నారు. ఇప్పటికే వరికి ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడులు వెచ్చించామని రైతులు వాపోతున్నారు. ఒక రౌండ్ రసాయన ఎరువులు, మందు పిచికారీ చేసి ఎండగడితే సరిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. ఇక హరివరం ఛానల్ కింద చాకరాజువేముల, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, కోవెలకుంట్ల మండలం కంపమల్ల, భీమునిపాడు గ్రామాల్లో మిరప, వరి రైతులది అదే పరిస్థితి.



నీటి తడులు లేక హరివరం ఛానల్ కింద బీటలు వారిన వరిపొలం

రెండు గ్రామాల రైతులు మధ్య ఘర్షణ

దొర్నిపాడు–అమ్మిరెడ్డినగరం గ్రామాల రైతుల మధ్య నీటి మళ్లింపులో ఘర్షణ జరిగింది. 24లాక్ వద్ద సాగునీరు గిరిగల లోతుకు చేరింది. దీంతో దొర్నిపాడుకు చెందిన రైతులు ఇక నీరు వస్తుందో రాదోనని పంట కాల్వల్లో నుంచి సాగునీరును మోటార్ల ద్వారా మళ్లించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అమ్మిరెడ్డినగరం గ్రామస్తులు కాల్వకట్ట వెంట వచ్చి మోటార్లను బంద్ చేయాలని చివరి ఆయకట్టుకు నీరు రావడంలేదని వాదించారు. దీంతో ఇరు గ్రామ రైతుల మధ్య ఘర్షణ నెలకొంది. పంటను తడుపుకునేందుకు రైతులు పగలు రాత్రి తేడా లేకుండా కాల్వల వెంట తిరుగుతున్నారు.

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను



రబీలో నాలుగు ఎకరాల్లో వరిని సాగుచేశాను. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పటికే ఎకరానికి 50వేల వరకు పెట్టుబడులు పెట్టాను. ప్రస్తుతం నీరు అందక పోతే మొత్తం గింజలన్నీ లొట్టలు పోతాయి. ధరలేక ఖరీఫ్‌లో నష్టపోయిన నాకు రబీ అనుకూలిస్తుందనుకుంటే సాగునీరు ఇబ్బంది పెడుతోంది. నెలాఖరు నాటికి నీరు వస్తేనే పంట చేతికి వస్తుంది. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

–సుబ్బారెడ్డి, అమ్మిరెడ్డినగరం

ఆందోళన చెందవద్దు

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు వదులుతున్నారు. ఏ ఒక్క రైతు ఆందోళన చెందవద్దు. అయితే, రానున్న నీటిని వృధా చేయకుండా వాడుకోవాలి. కాల్వల వెంట మోటార్లు వేయకుండా చర్యలు తీసుకుంటాం.

–స్వామి రంగారెడ్డి, కేసీ కెనాల్ ఏఈ

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శిరివెళ్ల: ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు మండలంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో శిరివెళ్ల, యర్రగుంట్లలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటికి చీఫ్, డిపార్టు మెంట్ అధికారుల నియామకాలు జరిగాయి. స్థానిక జెడ్పీ కేంద్రంలో శిరివెళ్ల, కస్తూరిబా, వీరారెడ్డిపల్లె పాఠశాలలకు చెందిన 124 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. డిపార్టు మెంట్ అధికారిగా వెంకటేశ్వర్లు, చీఫ్ సూపరిండెంట్‌గా విజయకుమారు నియమితులయ్యారు. యర్రగుంట్ల పరీక్ష కేంద్రంలో యర్రగుంట్ల, రాజనగరం, విమలా పాఠశాల, ఉషోదయ ఇంగ్లిషు మీడియం పాఠశాలలకు చెందిన 320 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి 2 సెట్ల పరీక్షా ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్ర పరిచారు.

ఉపాధిలో లక్ష్యాన్ని అధిగమించాలి

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని కల్పించడంలో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని ఏపీఓ రవిప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు వారి లేబర్ టార్గెట్ 1300 మంది కాగా ప్రస్తుతం 20 గ్రామ పంచాయతీల పరిధిలో 900 మంది మాత్రమే కూలీలు పనికి వస్తున్నారన్నారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ పనులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. మండలానికి ఇంకుడు గుంతలు 605 మంజూరయ్యాయని వాటన్నింటిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎఫ్ఏలు, టీఏలకు ఆదేశించారు.

రజకుల ఆత్మీయ సమావేశం విజయవంతం చేద్దాం

నంద్యాల(అర్బన్): ఈనెల 14న రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే రజకుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని రజక జేఏసీ అధ్యక్షుడు సురేష్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక నిశాంత్‌భవన్‌లో బుధవారం రజక సంఘాల సమావేశం నిర్వహించారు. జేఏసీ అధ్యక్షుడిగా సురేష్, గౌరవాధ్యక్షులుగా పెద్ద వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా రాములను ఎన్నుకున్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

శిరివెళ్ల: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం 2వ గ్రామ సచివాలయం సందర్శించి టీకాల పురోగతిపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చిన్నప్పుడే టీకాలు వేస్తే పోలియోను పూర్తిగా నిర్మూలించవచ్చునన్నారు. అందుకే నిర్దేశించిన మోతాదులో గర్భిణులు, పిల్లలకు టీకాలు వేస్తున్నామన్నారు. టీకాలు పిల్లల ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పుట్టిన 24 గంటల్లో తప్పని సరిగా పిల్లలకు బీసీజీ, పోలియో, హెపటైటిస్‌బీ వ్యాక్సిన్లు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ముఖేష్, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



టీకాలపై వైద్య సిబ్బందిని ఆరా తీస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

‘మాలల సింహగర్జన’ను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రాయలసీమ మాలల సింహగర్జన మహాసభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసీ పుల్లయ్య, ఉపాధ్యక్షుడు దస్తగిరి కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దేవంతకుడు అధ్యక్షతన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఈనెల 23వ తేదీన తిరుపతిలో జరిగే మాలల సింహగర్జన మహాసభకు మాలలందరూ హాజరు కావాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని, అందుకు విరుద్ధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రాముడు, శివుడు, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల పక్షం వైఎస్సార్‌సీపీ

- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే గంగుల



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నాయకులు

ఆళ్లగడ్డ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం పుట్టిన పార్టీ అని, వారికి అన్ని విధాలుగా అండగా నిలబడటమే లక్ష్యంగా పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఆళ్లగడ్డలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ సాధనకు వైఎస్సార్‌సీపీని స్థాపించడం జరిగిందని.. అందుకు అనుగుణంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. సూపర్ సిక్స్ పేరుతో నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పటి వరకు ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే అఖిలప్రియ తెలుగుగంగ కట్ట ధ్వంసం అయిందని చెప్పడం సిగ్గుచేటన్నారు. అధికారపార్టీ నాయకులు కట్ట వెంట పెద్దపెద్ద టిప్పర్లతో అక్రమంగా ఎర్రమట్టి తరలించుకుపోతుంటే కట్ట దెబ్బతినడంతో పాటు పంటలకు దుమ్ము అంటుకుని రైతులు నష్టపోతున్నారన్నారు. ఎర్రమట్టి తరలించే టిప్పర్లను అడ్డుకుంటే ఇవి ఎమ్మెల్యే భర్త భార్గవరామ్‌వి అని బెదిరించి తీసుకెళ్తున్నారని రైతులు వాపోతున్నారన్నారు. తెలుగుగంగ పనులకు సుమారు రూ. 300 నుంచి రూ. 400 కోట్లు ఖర్చువుతుందని అధికారులు అంచనా వేయడం జరిగింది. చేతనైతే నిధులు విడుదల చేయించి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి ఎంపీపీలు వీరభద్రుడు, అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు

జీతాల పెంపు జీవోలు అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీతాల పెంపు జీవో నెంబర్లు 57,132, 142, 680పై హైకోర్టు తీర్పు అమలు చేయాలని ఈనెల 17వ తేదీన విజయవాడలో జరిగే గ్రామ పంచాయతీ కార్మికుల మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, జీవోల ప్రకారం గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోగా జీతాలు చెల్లించడంతో పాటు పెండింగ్ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైమర్స్‌కు ప్రభుత్వమే ఎంటీఎస్ వేతనాలు చెల్లించాలని కోరారు. పంచాయతీలో పని చేస్తున్న డిగ్రీ, బీఈడీ చేసిన వారికి ఖాళీలను బట్టి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై విజయవాడలో మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం

- మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారిని కలిసి నంద్యాల నియోజకవర్గ సమస్యలను వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో శిల్పారవి మాట్లాడుతూ తల్లికి వందనం, నిరుద్యోగ భృతి అమలు ఎక్కడని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల ముందు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని, ఇప్పటి వరకు అతీగతీ లేదన్నారు. వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే వాటిని లాక్కునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని, నిర్మాణాలు జరగకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో పేదలకు వైఎస్సార్‌సీపీ ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అయితే, వాటిలో నిర్మాణాలు జరగకుండా అధికారపార్టీ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. నంద్యాల పట్టణానికి సంబంధించి ఎస్సార్బీసీ కాలనీ సమీపంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నందమూరి నగర్ – వైఎస్సార్ నగర్ మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీలో ఇంటి పన్ను మినహాయింపు ధ్రువపత్రాల కొరకు వచ్చిన మాజీ సైనికుడు దౌలత్ ఖాన్ మృతి చెందడం బాధాకరం అని, ఆయన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్‌అమీర్‌బాషా, మాజీ ఏపీఎస్బీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మేధావుల సంఘం నాయకుడు రసూల్ ఆజాద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి కారురవికుమార్, సాయిరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుగ్రహించు అహోబిలేశా

- వైభవంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు
- పోటెత్తిన భక్తులు



నృత్యం చేస్తున్న బాలికలు



కాళింగనర్ధనోత్సవంలో ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీనృసింహ స్వామి ఆలయం భక్త జనసంద్రంగా మారింది. స్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో స్వామి అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎగువ అహోబిలంలో ఉదయం కాళింగనర్ధనోత్సవము వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం స్వామి అమ్మవారికి అభిషేకం, తొట్టి తిరుమజనం నిర్వహించారు. రాత్రి ప్రహ్లాదవరద స్వామి గజవాహనంపై కొలువై మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. అనంతరం దిగువ అహోబిలంలో కొలువైన ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పట్టు వస్త్రాలు, సారె తీసుకొచ్చి సమర్పించారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

నంద్యాల: చుక్కల భూములు, సెక్షన్ 22 ఏ1 భూములపై స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూములు నిషేధిత జాబితాలో నుంచి తొలగింపుపై జిల్లాస్థాయి స్క్రూటినీ కమిటీ సమావేశం జరిగింది. నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ, డోన్ ఆర్‌డీఓ నరసింహులు, మండల తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సెక్షన్ 22 ఏ1 భూములు, చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు 24 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలి

నంద్యాల: పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుక అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ కార్యాలయం నుంచి పదవ తరగతి పరీక్షల నిర్వహణ, కలెక్టర్ల కాన్ఫరెన్స్, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాటు సారా జోలికి వెళ్లొద్దు

రుద్రవరం: నాటు సారా తయారీ, విక్రయాలు వంటి వాటి జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ సూచించారు. నాటు సారా నిర్మూలన కార్యక్రమం నవోదయంలో భాగంగా బుధవారం మండల పరిదిలోని హరినగరంలో ఆయన చెంచులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు కమలమ్మ,నాయకులు నాగముని,ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాస్, సరస్వతి, ఏపీ నాబార్డు ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై 15న దీక్షలు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో నిరాహార దీక్షలు చేయనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.

అభ్యంతరాలు ఉంటే సవరించుకోండి

రుద్రవరం: పంట నమోదు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 19 వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల సిబ్బంది వద్దకెళ్లి సవరించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సుమతి రైతులకు సూచించారు.మండల పరిధిలోని ఎల్లావత్తుల, కోటకొండ గ్రామాల్లో బుధవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.

23న అవగాహన పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): రామాయణ మహాకావ్యం అయోధ్య రామమందిరం విశేషాలపై ఈనెల 23వ తేదీన ప్రాథమిక అవగాహన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్లు రామకృష్ణారెడ్డి, శేషయ్య తెలిపారు. నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో కొమ్ముచెరువు ఆంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు.